క్లుప్తంగా

భవన నిర్మాణానికి నిధులు మంజూరు

రుద్రంగి: మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి రూ.2.5కోట్ల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. డీజీపీ, జిల్లా ఎస్పీని ఆదేశించి వారి సహకారంతో నిధులు మంజూరు చేయించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బోయినపల్లి: మండల కేంద్రంలో ప్రధాన రోడ్ల పరిసరాల్లో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ కోరారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మాట్లాడారు. రోడ్ల వెంట దీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఎడపెల్లి రాజేశ్, బోయిని ప్రవీణ్, కొండవేని పర్శరాములు, బొడ్డు అంజయ్య, ఎడపెల్లి నర్సయ్య, నాగం మల్లేశం తదితరులున్నారు.

పనులు కేకేవి.. ప్రచారం కేటీఆర్‌ది



మాట్లాడుతున్న ప్రవీణ్ జే టోని

తంగళ్లపల్లి: మండు వేసవిలో పంట పొలాలకు సాగునీరందక వేసిన పంటలు ఎండిపోతున్నట్లు తెలుసుకొని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి సాగునీరందించేందుకు చర్యలు చేపడితే.. ఆ క్రెడిట్‌ను ఎమ్మెల్యే కేటీఆర్ అప్పనంగా తన ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కండేయ హాల్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మాట్లాడారు. రైతుల గోస చూసి కేకే మహేందర్‌రెడ్డి సిద్దిపేట జిల్లా విఠలాపూర్ గ్రామ రైతులతో మాట్లాడి కాలువ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న నిర్వాసితులకు నష్ట పరిహారం ఇప్పించి శాశ్వత పరిష్కారం చూపి కాలువల ద్వారా చిన్నలింగాపూర్, నర్సింహులపల్లె, బాలమల్లుపల్లె గ్రామాలకు సాగునీరందేలా చొరవ చూపారని కొనియాడారు. సిరిసిల్ల ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగంగౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



గొల్లపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: కొదురుపాక మిడ్ మానేరు నుంచి మల్కపేట రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాచర్లగొల్లపల్లి బస్టాండ్‌లో నాయకులు క్షీరాభిషేకం చేసి అభిమానాన్ని చాటుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గౌస్ మాట్లాడుతూ.. నీటి విడుదలపై మల్కపేట రిజర్వాయర్ కాలువల కింద ఉన్న ఆయకట్టు రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు. కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తిశర్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, మర్రి వెంకట్‌రెడ్డి, మెండే శ్రీనివాస్, గుండాడి రాంరెడ్డి, గంట బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు నీరు



కుండీలో నీరు నింపుతున్న సురేశ్

ముస్తాబాద్: చిప్పలపల్లి అటవీ ప్రాంతంతోపాటు గూడెం, నామాపూర్ రహదారుల వెంట ప్రేరణ స్వచ్ఛంద సంస్థ మూగజీవాలతోపాటు వన్య ప్రాణులకు వేసవిలో తాగునీటినందించేందుకు ఏర్పాట్లు చేసింది. నాలుగేళ్ల క్రితం సంస్థ అధ్యక్షుడు మేడి సురేశ్ నిర్మించిన కుండీల్లో ఈ వేసవిలో నీటినందించేందుకు బుధవారం ప్రత్యేక ట్యాంకర్‌తో వెళ్లాడు. చిప్పలపల్లి అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులకు ప్రతి వేసవిలో నీటినందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సురేశ్ తెలిపారు. కుండీలను శుభ్రం చేసి నీటితో నింపామన్నారు. కోతులు, అడవి పందులు, జింకలు తదితర జీవాలకు వేసవిలో దాహార్తి తీర్చేలా తమవంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు.



నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ

ముస్తాబాద్: పోతుగల్‌లో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నవగ్రహ విగ్రహాలకు జలాదివాసం, ధాన్యాదివాసం, పుష్పాదివాసం జరిపారు. హోమం చేశారు. ప్రత్యేక పూజలు చేసి అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు.



ఎల్లమ్మ సేవలో విప్

వేములవాడఅర్బన్: కొడుముంజ గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, రంగు వెంకటేశ్, కదిరె రాజుకుమార్, ఎర్రం సత్తయ్య తదితరులున్నారు.



చదువుల తల్లిపై చిన్నచూపు

వీర్నపల్లి: ఒకప్పుడు పాఠశాలలో సరస్వతి విగ్రహానికి నమస్కరించి జ్ఞానమివ్వాలని వేడుకొని విద్యార్థులందరూ తరగతి గదిలోకి వెళ్లేవారు. స్థలం మారింది.. భవన నిర్మాణం మారింది.. రోజూ పూజలందుకున్న సరస్వతి నేడు నిరాదరణకు గురైంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి విగ్రహం వాటర్ సంపుపై ఉండడంతో.. విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చదువుల తల్లికి నీడ కల్పించాలని కోరుతున్నారు.

కంపుకొడుతున్న పల్లె

- అధికారులు రారు.. అవస్థలు తీరవు

వీర్నపల్లి(సిరిసిల్ల): గ్రామాల్లో పారిశుధ్యం పడకేసిందని, మంచినీటి సమస్య ఉంటే మూడు నాలుగు రోజులైనా పట్టించుకునే నాథుడే లేడని కొన్ని గ్రామాల్లో ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు వారికి రెగ్యులర్‌గా ఉండే పనులతోనే సతమతమవుతున్నారని, పల్లె పరిపాలన పట్టించుకునే సమయం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా అడిగేవారు లేక పంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

గ్రామాల్లో ముఖ్యంగా పారిశుధ్య సమస్యలతోపాటు మంచినీటి సౌకర్యం కోసం ఏదో ఒక మూలన ఇబ్బందులు వస్తుంటాయి. ప్రత్యేక అధికారి నోటీసులో లేనిదే పనులు చేయడానికి వీల్లేదని కార్యదర్శులు చెబుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు.

రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించే పండుగను కొన్ని గ్రామాల్లో పేలవంగా నిర్వహించారు. మహిళలు బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో విద్యుత్ దీపాలను అమర్చాలంటే తాజా మాజీ సర్పంచులు మాకేం బాధ్యత అంటూ తప్పించుకోగా.. రూ.వేల ఖర్చుతో కూడిన నిధులను ప్రత్యేక అధికారి అనుమతి లేనిదే విడుదల చేయలేమని పలు



వీర్నపల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

గ్రామాల కార్యదర్శులు తూతూ మంత్రంగా పెద్ద బతుకమ్మ వేడుకలను మమ అనిపించారు. కుక్కల బెడద ఉంది. కొన్ని గ్రామాల్లో చేతి పంపులు మరమ్మతుకు గురయ్యాయి.

తాగునీటి సమస్య ఉంది



మండల కేంద్రంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. పేరుకే మిషన్ భగీరథ నీరు. సకాలంలో తాగునీరు రాక బోరు బావుల కాడికెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నం. అధికారులు పట్టించుకుంటలేరు. మురుగు నీటి సమస్యతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నం.

– దాసారం రాకేశ్, వీర్నపల్లి

మురుగుతో తిప్పలు



ఇంటి ముందున్న మురుగు కాలువతో అనారోగ్యాల బారిన పడుతున్నం. రోడ్డు వేస్తామని ఉన్న మురుగు కాలువ తవ్వి నెలలు గడిచాయి. మురుగు కాలువ లేక కంపు వాసన, దోమలతో భరించలేకపోతున్నాం. మా ఇంట్లో అందరూ జ్వరాల బారిన పడ్డారు.

– దర్శనాల పుష్పలత, వీర్నపల్లి

పరిష్కరిస్తున్నాం



ప్రత్యేక అధికారులు ప్రతి గ్రామసభకు హాజరై గ్రామంలోని సమస్యలు కార్యదర్శులతో చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇప్పటివరకు గ్రామాల్లో ప్రత్యేక అధికారులు వస్తలేరని మా దష్టికి మాత్రం రాలేదు. గ్రామాల్లో ఉన్న సమస్యలు మా దృష్టికి వస్తే పరిష్కరిస్తున్నాం.

– అబ్దుల్ వాజిద్, ఎంపీడీవో, వీర్నపల్లి



వీర్నపల్లి: మండల కేంద్రం నుంచి రంగంపేట వెళ్లే ప్రధాన రహదారిపై గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు పెద్ద గుంత ఏర్పడింది. అక్కడున్న స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని వాపోతున్నారు. రాత్రి సమయంలో ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

కోనరావుపేట: కొలనూర్‌లోని మార్గదర్శి ఉన్నత పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించి వాటి పనితీరు వివరించారు. కరస్పాండెంట్ మండల చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల్లకల్చరల్: వెంకట్రావునగర్‌లోని విజ్ఞాన్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన విజ్ఞాన మేళా విద్యార్థుల సృజనాత్మకతను ఆవిష్కరించింది. మేళాను మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ ప్రారంభించారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ ప్రత్యేక అతిథిగా, గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు రాపెల్లి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాల నిర్వాహకుడు బొద్దుల సుదర్శన్, ప్రిన్సిపాళ్లు శ్రీగాథ గణేశ్, కూనపులి సురేందర్, ట్రస్మా జిల్లా, పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, యెల్లె శ్రీనివాస్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, ఆకుల చిన్న, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల ఎడ్యుకేషన్: చంద్రంపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిట్స్ ఆలోచింపజేశాయి. సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అంజలి విద్యార్థులను ఉత్తేజితం చేసి వారితో ప్రయోగాలు చేయించారు. మూఢనమ్మకాలకు సైన్స్ ఏకైక అస్త్రంగా పని చేస్తుందని ప్రధానోపాధ్యాయులు వనమాలై శ్రీనివాస్ పేర్కొన్నారు.



పరికరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



దుమాల పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

విజ్ఞానం పెంపొందించుకోవాలి

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులు విద్యతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో కృష్ణహరి అన్నారు. రాచర్లబొప్పాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు దుమాల గిరిజన ఏకలవ్య మోడల్ పాఠశాలను బుధవారం సందర్శించారు. పాఠశాలలోని తరగతి గదులు, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, మ్యూజియం, ఆర్ట్, కంప్యూటర్, జిమ్, ఆట స్థలం, డైనింగ్‌లను పరిశీలించారు. హెచ్ఎం మధుమాలతి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భరత్, భాస్కర్, మంజుల పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ బాలమల్లు

ఎల్లారెడ్డిపేట: వెంకటాపూర్ శివారులోని హన్మాన్ ఆలయం మలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలపాయ్యారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. రాగట్లపల్లికి చెందిన చెరుకు బాలమల్లు అనే వ్యక్తి మరొకరితో కలిసి ద్విచక్ర వాహనంపై సిరిసిల్లకు వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. బాలమల్లు ముఖం, తలకు బలమైన గాయాలు కావడంతో అతడి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

మలుపు వద్ద ప్రమాదం



ధ్వంసమైన కారు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని ప్రమాదకరమైన మలుపు బొమ్మల వద్ద బుధవారం వాహనాలు ఢీకొట్టుకున్నాయి. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న ఒక కారు అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో ముందున్న కారు మరో కారును.. ఆ కారు దానిముందున్న ఆటోను ఢీకొట్టింది. మూడు కార్లు, ఒక ఆటో స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఎవరికి గాయాలు కాలేదు.

చికిత్స పొందుతూ మృతి

వేములవాడ: పట్టణానికి చెందిన న్యాయవాది చెర్ల ఆనంద్‌కుమార్(65) వారం రోజుల క్రితం ఎదురుగట్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. బార్ అసోసియేషన్ ప్రగాఢ సానుభూతిని ప్రకటించింది. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.


రాజన్న సేవలో టీచర్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న పింగళి శ్రీపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వేములవాడ: రాజన్నను నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి గెలుపొందిన పింగళి శ్రీపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు, ఉద్యోగులకు రావాల్సిన 5 డీఏలు, ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సాధించేందుకు పోరాడుతానన్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిప్ప యాదగిరి, ఆలూరి ఆనందరావు, దుబ్బాక ప్రభాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాడిశెట్టి మహేశ్, నాయకులు జక్కని నవీన్, ఎల్.కిరణ్, శ్రీనివాసాచారి, సాంబారెడ్డి, కె.రమేశ్, హన్మండ్లు, ఎస్.రాంప్రభు, మధుకర్ తదితరులున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో బుధవారం సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	09	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	01	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	01	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	02	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	03	560
నందీశ్వర సూట్స్	01	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	10	448
పార్వతీపురం స్పెషల్	19	672
పార్వతీపురం సాధారణ	15	336

- వేములవాడ

ఐక్యతతోనే మున్నూరు కాపుల అభివృద్ధి



నాయకులతో కొండ దేవయ్య అభివాదం

సిరిసిల్లటౌన్: ఐక్యతతో ముందడుగు వేసినప్పుడే తమ సామాజికవర్గం అన్నివిధాలా అభివృద్ధి సాధిస్తుందని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. బుధవారం సిరిసిల్ల మున్నూరు కాపు సంఘంలో జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య అధ్యక్షతన జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయాలని, వేములవాడ శాసన సభ్యుడు, మున్నూరు కాపుప సంఘం నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవివ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు గడ్డం నర్సయ్య, కల్లూరి చందన, చిలుక రమేశ్, కల్లూరి రాజు, అగ్గి రాములు, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిపేటలో విద్యార్థులకు పెన్నులు ఇస్తున్న నాయకులు



తంగళ్లపల్లి: ఇంటర్ పరీక్షలకు వెళ్తున్న కేజీబీవీ విద్యార్థినులు



రుద్రంగి: పరీక్ష రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు



చందుర్తి పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. రాచర్లజూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 198 మంది విద్యార్థులకు గాను 193, ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 188 మందికి గాను 184 మంది పరీక్షలకు హాజరయ్యారు. 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు సంస్కృతం, తెలుగు పరీక్షలకు హాజరైన విద్యార్థులకు రెండు కేంద్రాల వద్ద బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆకుల మురళీగౌడ్, పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు శివరామకృష్ణ పెన్నులు, పరీక్ష సామగ్రి అందించారు.

తంగళ్లపల్లి: బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సెంటర్ ఏర్పాటు చేయగా.. కేజీబీవీ పద్మనగర్ నుంచి పరీక్షలు రాసేందుకు విద్యార్థినులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

రుద్రంగి: రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 130 మందికి గాను 127 మంది హాజరయ్యారు.

చందుర్తి: చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు కట్టుదిట్టమైన భద్రత మధ్య బుధవారం మొదలయ్యాయి. విద్యార్థులను కేంద్రం బయటే ఇన్విజిలెటర్లు క్షుణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. మొదటి సంవత్సరంలో 130 విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ కృష్ణాకర్ తెలిపారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 256 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎగ్జామ్స్ చీఫ్ సూపరింటెండెంట్ సునీత తెలిపారు.

గుండెపోటుతో మృతి

చందుర్తి: బండపల్లి గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు న్యాత నవీన్(లడ్డు) తండ్రి రాజయ్య గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. రాజయ్య మృతదేహం వద్ద ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాళి అర్పించారు. నవీన్‌ను పరామర్శించారు.